ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 11 ఏప్రిల్ 2024

అమరుల స్మారక చిహ్నాన్ని నిర్మించాలి 8లో..

విద్యా సంస్థల్లో వార్షికోత్సవాల హంగామా 8లో..



రేషన్ షాపులపై నిఘా కరువు

- పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం
- వేలిముద్రలు వేయించుకొని కొనుగోలు చేస్తున్న డీలర్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో రేషన్ షాపులపై నిఘా కరువయ్యింది. రేషన్ డీలర్లపై సంబంధిత అధికారుల నిఘా లేకపోవడంతో డీలర్లు వినియోగదారుల నుంచి తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లర్లకు, మహా రాష్ట్రకు తరలించే బ్రోకర్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే రేషన్ డీలర్లే గాకుండా వినియోగదారుల నుంచి కొందరు బియ్యం వ్యాపారులు కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నారు. రేషన్ సరుకుల పంపిణీపై పర్యవేక్షించేందుకు నియమించిన సివిల్ సప్లయ్ విజిలెన్స్ కమిటీ సమావేశాలను ప్రతి మూడు మాసాలకోసారి నిర్వహించని కారణంగా కూడా రేషన్ బియ్యం పక్కదారి పట్టేందుకు ఆస్కారం ఏర్పడుతున్నదనే విమర్శలు వస్తున్నాయి. ప్రతి నెలా వస్తున్న రేషన్ కోటాలో సగానికి పైగా రేషన్ బియ్యం నల్లబజారుకు తరలుతున్నాయి. జిల్లాలో 413 రేషన్ షాపులు ఉండగా, వీటి పరిధిలో 2.07,231 ఆహార భద్రత కార్డులు, 12,290 అంత్యోదయ కార్డులు, 156 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. వీటిపై ప్రతినెలా 32,231 క్వింటాళ్ల బి య్యం రేషన్ షాపులకు చేరుతున్నాయి. ఒక్కో వినియోగదారుడికి 6కిలోల చొప్పున ప్రభుత్వం బియ్యం అందజేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం రూపాయికే కిలోబియ్యం ఇస్తుండగా, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుండడంతో ప్రభుత్వానికి బియ్యంపై చెల్లించాల్సిన సబ్సిడీ సొమ్ము ఆదా అవుతున్నది. రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేసేందుకు స్టేజీ 1 గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు బియ్యం సరఫరా అవుతాయి. అక్కడినుంచి రేషన్ షాపులకు నేరుగా సరఫరా చేస్తారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేస్తారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బియ్యం రావడం ఒకటి, రెండు రోజులు ఆలస్యమైతే, తేదీలను పెంచు తారు. బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు కార్డుపై ఉండే వినియోగదారుల్లోని ఒకరు షాపు వద్దకు వెళ్లి వేలిముద్ర వేసిన తర్వాతనే బియ్యం అందజేస్తారు. నిర్ణీత గడువులోపు షాపునకు వెళ్లి బియ్యం తెచ్చుకోకుంటే ఆ బియ్యం తిరిగి ఇవ్వరు. రేషన్ బియ్యం కింద దొడ్డు బియ్యం ఇస్తుండడంతో సగానికి పైగా వినియోగదారులు రేషన్ బియ్యం తినడం లేదు. వాటిని కిలోకు 12 నుంచి 14 రూపాయలకు విక్రయించుకుంటున్నారు.రేషన్ డీలర్లు 10 నుంచి 12 రూపాయలకు కిలో చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారుల వేలిముద్ర వేయించుకున్న తర్వాత బియ్యం తూకం వేసి వాటిని అక్కడనే ఉంచుకుంటున్నారు. ఏ రోజుకు ఆరోజు వినియోగదారుల నుంచి ఎంత మేరకు బియ్యం కొనుగోలు చేశారో అంత మొత్తం రాత్రివేళలో రహస్య ప్రాంతానికి తరలిస్తున్నారు.

● సగానికి పైగా నల్లబజారుకు..

రేషన్ షాపులకు రెండు విడతల్లో బియ్యం వస్తుండడంతో కొందరు డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి షాపునకు తీసుకరాకుండా మధ్యలోనే మాయం చేస్తున్నారు. గత ఏడాది సుల్తానాబాద్ మండలం సుద్దాలలో గల స్టేజీ 1 గోదాం నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలిన రెండు లారీల లోడ్‌ల బియ్యం అక్కడికి రాకుండానే పక్కదారి పట్టాయి. రేషన్ డీలర్లే గాకుండా సంచార జాతులకు చెందిన వాళ్లు రేషన్ షాపులకు కొద్ది దూరం అడ్డా వేసి వినియోగదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు గల్లీలు తిరుగుతూ ఇళ్ల వద్దకు వచ్చి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ బియ్యాన్ని బియ్యం దందా చేసే బియ్యం మాఫియాకు విక్రయిస్తున్నారు. వాళ్లు మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర సరిహద్దు అయిన కాళేశ్వరం దాటిన తర్వాత సిర్వోంచ సరిహద్దులో అనేక లారీల బియ్యం పట్టుబడ్డాయి. రేషన్ డీలర్ల నుంచి మాత్రం మిల్లర్లు కొనుగోలు చేసి వాటిని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద తిరిగి ఎఫ్‌సీఐకి పెడుతున్నారు. ప్రతినెలా సగానికి పైగా రేషన్ బియ్యం నల్లబజారుకు తరలుతున్నాయి. పౌరసరఫరాల శాఖాధికారులు, రెవెన్యూ శాఖాధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సరైన నిఘా లేని కారణంగా రేషన్ బియ్యం దందా జిల్లాలో మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతున్నది. సివిల్ సప్లయ్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలైతే కాగితాలకే పరిమితం అయ్యాయి. ప్రతిమూడు మాసాలకోసారి సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా, సమావేశాలు నిర్వహించిన దాఖలాలు కనబడడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు రేషన్ షాపులపై నిరంతరం నిఘా పెడితేగానీ రేషన్ బియ్యం అక్రమ దందా ఆగదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇఫ్తార్ విందులతో సోదరభావం పెంపు

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ఎమ్మెల్యే విజయరమణారావును సన్మానిస్తున్న ముస్లింలు

జూలపల్లి, ఏప్రిల్ 10 : ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే విజయరమణారావు ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. జూలపల్లి మజీదులో ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ముస్లింలు ఘనంగా సన్మానించారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఎండి ఎషానుల్లా, లాల్‌మహ మ్మద్, ఎండీ పకీర్, ఎండీ తాహెర్‌పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, విండో మాజీ చైర్మన్ గండు సంజీవ్, పొట్యాల శంకర య్య, ఏదుల్ల కనుకయ్య, సిరికొండ కొమురయ్య, పొట్యాల బీరయ్య, బండి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓదెల : మండలంలోని పొత్కపల్లి మజీద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై ముస్లింలకు మిఠాయి తినిపించారు. అనంతరం ఎమ్మెల్యేను ముస్లింలు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృసి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కట్కూరి సమ్మిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య, మాజీ సర్పంచ్ పడాల రాజు, రెడ్డి రజనికాంత్, అంబాల కొమురయ్య, నోముల సాగర్‌రెడ్డి, గొడుగు అయిలయ్య యాదవ్, నీర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో విచ్చలవిడిగా అక్రమ దందాలు

- జడ్పీ చైర్మన్ పుట్ట మధు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని, ఏప్రిల్ 10: కాంగ్రెస్ పాలనలో విచ్చలవిడిగా అక్రమ దందాలు కొనసాగుతున్నాయని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు ఆరోపించారు. తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్పీ చైర్మన్‌పుట్ట మధు మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో బీసీ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా ఎదిగిన తనపై కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేసి ప్రజల నుంచి దూరం చేశారన్నారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ నాయకులు రాబోయే ఎన్నికల్లో వారికి ఎదురు లేకుండా ఉండేలా చేసుకుంటున్నారన్నారు. ఇందు కోసం తనను చంపేందుకు కాంగ్రెస్ నాయకులు కుట్ర చేస్తున్నారన్నారు. జడ్పీ చైర్మన్‌గా ఉన్న తనకు గన్‌మెన్‌లు ఉండగా చంపడం వీలు కాదని, పదవీ కాలం ముగిసిన వెంటనే గన్‌మెన్లను తొలగించి చంపేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తనను ఖతం చేయడంతో పాటు నియోజకవర్గంలో మరో బీసీ నాయకుడు ఎదగకుండా చూస్తున్నారన్నారు. మంథని నియోజకవర్గంలో ప్రతీరోజు ఏదో ఒక చోటు దొంగ లారీలు పట్టుబడుతున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక, బియ్యం, మట్టి అక్రమ రవాణా దందాలు జోరుగా సాగుతున్నాయని, వీటికి కాంగ్రెస్‌లోని కొంత మంది నాయకులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారన్నారు. పోలీస్‌స్టేషన్లలో సైతం పైరవీలకు కూడా ప్రత్యేకంగా ఇన్‌చార్జిలను నియమించారని ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఇసుక క్వారీలు నిర్వహించి వాటి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఇసుక క్వారీలు నిర్వహిస్తున్నారని, కానీ వీటిని అక్రమంగా నిర్వహిస్తున్నారని, దీని వల్ల ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం రావడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులకు మాత్రమే ముడుపులు ముడుతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ప్రజాప్రతినిధిగా ఉన్న తనపై కాంగ్రెస్ నాయకులు అనేక ఆరోపణలు చేశారన్నారు. తనకు ఇసుక లారీలు, క్వారీలు ఉన్నాయని ఆరోపించారని, ప్రస్తుతం వారి ప్రభుత్వమే అధికారంలో ఉందని తనపై చేసిన ఆరోపణలు ఎందుకు రుజువు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మిన ప్రజలు నాలుగు నెలల కాలంలోనే అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా మంథని నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులై తనపై చేసిన ఆరోపణలపై ఆధారాలు చూపించాలని కాంగ్రెస్ వాళ్లను ప్రశ్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు జక్కు రాకేష్, తగరం శంకర్‌లాల్, కుమార్, రవిలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి..

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 10 : పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీవో సుదర్శన్ అన్నారు. బుధవారం మండలంలోని బొంపల్లి గ్రామంలో నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డును ఎంపీవో పరిశీలించారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్డు ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేయాలని, షెడ్డు వద్దనే చెత్తను వేరుచేయాలని వారికి సూచించారు. వేసవి కాలం దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గుబాయిపై 'కొప్పుల'కు చేదు అనుభవం

- జీడీకే 1వ గనిలో నిలదీసిన మహిళా కార్మికులు - ప్రచారం చేయకుండానే వెనుదిరిగిన ఈశ్వర్



బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను నిలదీస్తున్న మహిళా కార్మికులు

గోదావరిఖని, ఏప్రిల్ 10: మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు బొగ్గు బాయిలపై నిరసన సెగ తగిలింది. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డితో కలిసి బుధవారం జీడీకే వన్ ఇంక్లైన్‌పై ఎన్నికల ప్రచారానికి వెళ్లిన కొప్పుల ఈశ్వర్‌ను మహిళా కార్మికులు నిలదీశారు. సమస్యలున్నప్పుడు పట్టించుకోలేదు... ఇప్పుడెందుకు వచ్చారంటూ ప్రశ్నించారు. మూకుమ్మడిగా 50మంది మహిళా కార్మికులను బదిలీలు చేస్తే బదిలీలు చేస్తే మాట్లాడలేదని, మహిళా కార్మికుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, మహిళలను గనులపై, ఎండల బలవంతంగా పని చేయించడం వల్ల చాలా మంది కళ్లు తిరిగి పడిపోతున్నారన్నారు. ఎన్నికలప్పుడే వస్తారా, సమస్యలుంటే పట్టించుకోరా అంటూ మహిళా కార్మికులు నిలదీశారు. ఏసీ రూముల్లో ఉండే మీకు మా కష్టాలు ఏం తెలుస్తాయంటూ మహిళా కార్మికులు ప్రశ్నించారు. కొప్పుల ఈశ్వర్ బంధువులు గనిలోకి దిగడం లేదని, వారితో గని ఉపరితల పనులు చేయిస్తున్నారని, అనారోగ్యంతో ఉన్న కార్మికులను గని లోపలికి దించుతూ పనులు చేయిస్తున్నారని, ఇదెక్కడి న్యాయం అంటూ ప్రశ్నించారు. మేము అధికారంలో లేము కదా అని ఈశ్వర్ అనగా మీరు అధికారంలో ఉన్నప్పుడే ఈ వేధింపులు జరిగాయని వారు ఆరోపించారు.

దీంతో మహిళలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అక్కడి నుంచి కొప్పుల ఈశ్వర్ వెళ్లిపోయారు. మహిళలు ఈశ్వర్‌ను నిలదీసిన ఘటనను చిత్రీకరించిన ఒక ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిపై మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విరుచుకుపడ్డాడు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి శివ చేతులోని ఫోన్‌ను లాక్కొని అందులోని వీడియోలను డిలీట్ చేశారు. దీంతో చందర్ చర్యను విలేకరులు ఖండించారు.

కోరుకంటి దురుసు ప్రవర్తన సిగ్గుచేటు : ఎమ్మెల్యే

టీబీజీకేఎస్ నాయకులు సింగరేణి కార్మికులను నానా రకాలుగా వేధించారని, ఇప్పుడు గనులపైకి బీఆర్ఎస్ నాయకులు వెళితే కార్మికులు నిలదీస్తున్నారని, దీంతో విలేకరులపై నాయకులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌ఇంక్లైన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను మహిళా కార్మికులు నిలదీసిన సంఘటనపై వీడియోలు తీసిన విలేకరులపై మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ దురుసుగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు సింగరేణి కార్మికులకు చేసిందేమి లేదని, ఎక్కడికి పోయినా వారిని నిలదీస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సింగరేణి కార్మికులను ఇబ్బందులకు గురిచేశారని, అప్పుడు లంచాలు లేనిదే పనులు జరిగేవి కావని, కార్మికులు బీఆర్ఎస్ నాయకులపై ఆక్రోశం వెల్లబోస్తున్నారని, ఇప్పటికైనా నాయకులకు బుద్ధి రావాలన్నారు.

పన్నుల భారం తగ్గేదెన్నడో?

- సుల్తానాబాద్ మున్సిపాలిటీలో అస్తవ్యస్తంగా పన్నుల విధానం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం

సుల్తానాబాద్, ఏప్రిల్ 10: గతంలో ఓ ప్రజాప్రతినిధి మెప్పు కోసం ఒక అధికారి చేసిన పనితో సుల్తానాబాద్ పట్టణ ప్రజలు పన్నుల భారాన్ని మోయాల్సి వస్తోంది. పెంచిన పన్నులను చెల్లించే స్తోమత లేక చాలా మంది ఇబ్బందులు పడుతుండగా, పన్నులు సకాలంలో చెల్లించకపోతే వడ్డీ మీద వడ్డీ పడి పన్నులు మరింత పెరుగుతాయని మున్సిపల్ సిబ్బంది, ఉద్యోగుల హెచ్చరికలు మరో వైపు భయం కలిగిస్తుండడంతో పట్టణ ప్రజల పరిస్థితి అగమ్యగో చరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే విజయరమణారావు తన ప్రచారంలో భాగంగా పెంచిన పన్నులను తగ్గిస్తామని, పాత విధానాన్నే అమలుచేయిస్తామని హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీ ఎప్పుడు అమలవుతుందా అని పట్టణ ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. అయితే ఆ దిశగా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

● మేజర్ గ్రామ పంచాయతీ నుంచి..

మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న సుల్తానాబాద్‌ను ఐదున్నర సంవత్సరాల క్రితం ప్రభుత్వం మున్సిపాలిటీగా మార్చింది. పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారితే పట్టణంలో మరింత అభివృద్ధి చోటుచేసుకుంటుందని, అనేక వసతులు కల్పిస్తారని, ఇలా అనేక ఆశలు ప్రజలు పెట్టుకున్నారు. కానీ ఎవరూ ఊహించని విధంగా ఆస్తి పన్నులను ఆకాశన్నంటించి ప్రజలపై మోయలేని భారంమోపి వారి నడ్డివిరుస్తున్నారు. ఈ పన్నులు చెల్లించే బదులు ఉన్న ఆస్తులు అమ్ముకోవడమే శరణ్యమని కొందరు వాపోతున్నారు.

● మునిసిపాలిటీలో 5300 గృహాలు..

మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న సుల్తానాబాద్‌లో పూసాల, శాస్త్రినగర్, సుగ్లాంపల్లి, శ్రీరాములపల్లి గ్రామాలను కూడా మున్సిపాలిటీలో చేర్చారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 5300 గృహాలు ఉన్నాయి. వీటిలో కొన్ని ఇళ్లకు పెద్దఎత్తున పన్నులు పెంచారు. కొత్తగా ఇల్లు నిర్మించుకున్న వారికి మాత్రం వేలల్లో పన్నులు విధిస్తున్నారు. ఓ సామాన్యుడు ఇల్లు కట్టుకుంటే అతనికి ఏడాదికి రూ.25 వేలు పన్ను వేశారు. ఇక గతంలో పాత పన్నులు రెండు వేల రూపాయలు ఉన్న వారికి ఇప్పుడు 20 నుంచి ముప్పై వేలకు పెంచి నోటీసులు అందజేశారు. ఈ పన్నుల పంచాయతీ గత ఏడాదిన్నర నుంచి ఇక్కడ నడుస్తుంది. చాలా మంది బాధితులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ వేసారిపోతున్నారు. ఇటు అధికారులను, అటు ప్రజాప్రతినిధులను కలుస్తున్నారు. కానీ వారికి న్యాయం జరగడం లేదు. పన్నులను తగ్గించేది తమ చేతిలో లేదని చెపుతున్నారు. గతంలో పని చేసిన అధికారి చేసిన పన్నుల పెంపు ప్రతిపాదనలు ఇప్పుడు ప్రజలకు గుదిబండగా మారాయని పలువురు భావిస్తున్నారు.

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

- కట్ల వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ధరణి పోర్టల్, భువన్ యాప్ వంటి వాటిని ఏర్పాటు చేసిన సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని భూముల ధరలు ఎక్కువగా నమోదు అవుతుండడం వలను ఇలా పన్నులు అధికంగా వచ్చాయి. తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత పలువురు బాధితులు ఈ విషయం నా దృష్టికి తెచ్చారు. ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని నివేదిస్తాను.

● సీఎంతో చర్చించి న్యాయం చేస్తాం..

- విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే

సుల్తానాబాద్‌లో పెంచిన పన్నుల భారం వలన ప్రజలు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసు. గతంలోనే తాను పెంచిన పన్నులు వసూలు చేయవద్దని అధికారులకు సూచించాము. ప్రజలకు వ్యాపారులకు అండగా నిలిచాము. పన్నుల తగ్గింపు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తాను. మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో ఈ మేరకు ఓ తీర్మానం చేసి ప్రభుత్వం ద్వారా పన్నుల తగ్గింపుకు కృషి చేస్తాను.

వార్డుల్లో పారిశుధ్యమే ప్రధాన ఎజెండా..

- మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ

మంథని, ఏప్రిల్ 10: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుధ్యమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమాసురేష్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని పలు వీధులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కాలనీల్లో ఉన్న సమస్యలను ప్రజలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. శ్రీమహాలక్ష్మి టెంపుల్ ఏరియా, శ్రీపాద కాలనీ, అంబేద్కర్ చౌరస్తా, లక్ష్మీనారాయణ స్వామి టెంపుల్ ఏరియాల్లో పారిశుధ్యం, తాగునీటికి సంబంధించిన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీల్లో ఉన్న చెత్తాచెదారాలను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. మున్సిపల్ పరిధిలోని వార్డుల సందర్శన కార్యక్రమాన్ని త్వరలో చేపడుతామని, ప్రతి వారం ఒక వార్డుగా కేటాయించుకొని సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మానేరు వద్ద దీక్షలకు కాంగ్రెస్ నేతల మద్దతు

సుల్తానాబాద్, ఏప్రిల్ 10: ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని కొన్ని రోజులుగా మండలంలోని గట్టేపల్లి మానేరు వాగులో నాయకులు చేస్తున్న దీక్షలకు బుధవారం కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. దీక్ష శిబిరాన్ని బుధవారం కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మినుపాల ప్రకాష్‌రావు, ఉమ్మడి జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్ తదితరలు సంఘీభావం తెలిపారు.

సుల్తానాబాద్ పట్టణంలో రోడ్ల అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి

సుల్తానాబాద్, ఏప్రిల్ 10: సుల్తానాబాద్ పట్టణంలోని రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తామని, పాత జెండా నుంచి చెరువు వరకు రోడ్డును అభివృద్ధి పరుస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు అన్నారు. బుధవారం ఈ రోడ్డుకు సంబంధించి డ్రైనేజీ పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి మాట్లాడుతూ రాజీవ్ రహదారి నుంచి పాతజెండా మీదుగా శివాలయం నుంచి నీరుకుళ్ల రోడ్డు మజీద్ చౌరస్తా వరకు ఉన్న పాత రోడ్డును విస్తరించడంతో పాటు నూతన రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి నిధులు కూడా మంజూరయ్యాయని, మొదటగా డ్రైనేజీ పనులు మొదలుపెట్టినట్లు వివరించారు. రోడ్డువిస్తరణలో ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ఈ రోడ్డు విస్తరణ మూలంగా ఆయా గృహాల యజమానులకు మరింత సౌలభ్యంగా ఉంటుందని అన్నారు.

పిచ్చి కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలో హన్‌మాన్‌నగర్, మెయిన్ రోడ్‌పై బుధవారం పిచ్చి కుక్కలు వీరంగం సృష్టించాయి. దారి వెంట వెళ్లే వారిపై పిచ్చి కుక్కలు దాడికి తెగబడ్డాయి. ఎక్క డ పడితే అక్కడ దాడి చేస్తూ గాయపర్చడంతో భయంతో పరుగులు తీశారు. హన్‌మాన్‌నగర్‌లో నలుగురిపై, మెయిన్‌రోడ్‌పై మరో నలుగురుపై పిచ్చి కుక్కలు దాడి చేశాయి. అబ్దుల్లా, ఆరీఫ్, షాదుల్, అజ్నాన్‌తో పాటు మరో నలుగురిని పిచ్చి కుక్కలు గాయపర్చాయి. గాయ పడ్డ వారిలో నలుగురు మహిళలు ఉన్నారు. వీరందరిని ముందుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కొందరిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భూఆక్రమణ కేసులో ధరణి మాజీ కో ఆర్డినేటర్ బుచ్చిరాజు అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడిన కేసులో నిందితుడిగా ఉన్న కరీంనగర్ కలెక్టరేట్‌లో ధరణి మాజీ కోఆర్డినేటర్ భగత్‌నగర్‌కు చెందిన ఎల్లంకి బుచ్చిరాజును కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ బుధవారం అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి, జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్‌లో నకిలీ ధ్రువపత్రాలతో భూ ఆక్రమణకు పాల్పడినట్లు బాధితుడు బొంతల రఘు ఫిర్యాదుతో కొత్తపల్లి ఠాణాలో ఇదివరకే మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌తో సహా 12 మందిపై కేసు నమోదైంది. కాగా అప్పుడు తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మిగతా 9 మందిలో ఏ12 నిందితుడిగా ఉన్న ఎల్లంకి బుచ్చిరాజును బుధవారం అరెస్టు చేశారు. బుచ్చిరాజు గతంలో కలెక్టరేట్‌లో ధరణి కో ఆర్డినేటర్‌గా పనిచేశాడని, తహసీల్దార్‌కు సహకరించాడని సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వీర్నపల్లి, ఏప్రిల్ 10: పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు ఎక్కడున్నా పట్టేస్తున్నారు. వీర్నపల్లి మండలం రంగంపేటలో పెద్దమ్మ ఆలయం వద్ద అదే గ్రామానికి చెందిన బొజ్జ కనకరాజు సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పరిజ్ఞానంతో పోలీసులు పట్టుకున్నారు. ఫోన్‌ను బుధవారం ఏఎస్‌ఐ రాజిరెడ్డి బాధితుడికి అందజేశారు.

ఎండవేడికి చెరువులోని చేపలు మృతి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని మర్రిపల్లిలోని చెరువులో ఎండ వేడిమిని తట్టుకోలేక చేపలు మృతి చెంది బుధవారం ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. చెరువును ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటేష్ కుమార్, కోర్ కమిటీ సభ్యులు చొక్కాల రాము, రేగుల మల్లికార్జున్, రేగుల రాజేశం, మర్రిపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పండుగ మల్లేశం, సభ్యులు పరిశీలించారు.

టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌గా పొన్నం అశోక్‌గౌడ్



కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 10: మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరుడు, సీనియర్ న్యాయవాది పొన్నం అశోక్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్, హ్యూమన్, ఆర్టీఐ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా నియామకం చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అడ్వకేట్ సెక్రెటరీ విపుల్ మహేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, సీనియర్ న్యాయవాది, హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పొన్నం అశోక్‌గౌడ్‌కు పదవి రావటంపై కాంగ్రెస్‌పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని పటిష్టపరిచేందుకు తన శక్తివంచ లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు పదవి రావటంలో కీలకంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ఏఐసీసీ అడ్వకేట్ సెక్రెటరీ విపుల్ మహేశ్వరిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కరీంనగర్ రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్
- అల్లీపూర్ గురుకుల పాఠశాలలో విచారణ

రాయికల్, ఏప్రిల్ 10: గురుకుల పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని గురుకుల పాఠశాలల రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్ పేర్కొన్నారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ మహాత్మ బాపూలే గురుకుల పాఠశాలలో జరిగిన విద్యార్థుల ఘర్షణపై గురుకుల పాఠశాలల కరీంనగర్ రీజనల్ కో ఆర్డినేటర్ గౌతమ్ బుధవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి, విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌సీవో గౌతమ్ మాట్లాడుతూ గురుకులంలో చదివే విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉంటారని, బాత్‌రూమ్‌కు వెళ్లే సందర్భంలో విద్యార్థుల మధ్య జరిగిన ఘటనలో విద్యార్థి గాయపడినట్లు తెలిసిందని పేర్కొన్నారు. గాయపడిన విద్యార్థి పాఠశాలలో ఉపాధ్యాయులకు తెలియజేయక పోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆశ్రయించి ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. ఉగాది సందర్భంగా సెలవు కావడంతో పాఠశాలలో ఉపాధ్యాయులు దశలవారీగా విధులు నిర్వహిస్తారన్నారు.

విద్యార్థి గాయపడిన విషయం ఉపాధ్యాయులకు తెలుపకపోవడం వల్లే తల్లిదండ్రులు ఆగ్రహించారన్నారు. ఈ ఘటనలో విద్యార్థిపై దాడి చేసినట్లు ఆరోపిస్తున్న విద్యార్థికి కౌన్సెలింగ్ నిర్వహించామని, పద్ధతి మార్చుకోకపోతే రానున్న అకాడమిక్ సంవత్సరంలో వేరే పాఠశాలకు బదిలీ చేస్తామని తెలిపారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని, అలాగే సెలవు దినాల్లో ఒకరికి అదనంగా మరొక ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తించేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందివ్వడంతో పాటు వైద్యులకు సంప్రదించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు.

మెడికల్ కళాశాల నిర్మాణాలను అడ్డుకున్న రైతులు

- నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్
- రైతులపై దాడి చేసిన కాంట్రాక్టర్
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- ఫిర్యాదు చేసిన రైతులు


కళాశాల భవన నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10: నష్ట పరిహారం ఇవ్వకుండానే నమ్మించి మోసం చేసి మెడికల్ కళాశాలను నిర్మించారని నష్టపరిహారం ఇచ్చిన తర్వాతనే అదనపు భవనాల నిర్మాణాలను చేపట్టాలంటూ సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ మెడికల్ కళాశాల వద్ద పనులను మూడు రోజుల నుంచి రైతులు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కాంట్రాక్టర్ దగ్గరుండి పనులు చేయిస్తుండగా విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లి పనులు నిలిపివేయాలని కోరారు. దీంతో కాంట్రాక్టర్ ఆవేశానికి లోనై రైతులపై దాడి చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. తమపై దాడిచేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దూరు శివారులోని సర్వే నంబర్ 408లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో అప్పటి ప్రభుత్వం 40 మంది నిరుపేద రైతులకు జీవనోపాధి కోసం అందించాయి.

జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరు కావడంతో అప్పటి మంత్రి కేటీఆర్ జిల్లా కలెక్టర్‌తో కలిసి రైతులకు సమాచారం ఇవ్వకుండానే 36 ఎకరాల స్థలాన్ని కళాశాలకు కేటాయించారు. దీంతో తమ భూములను తీసుకోవద్దంటూ రైతులు ఆందోళన చేయడంతో రైతులతో కేటీఆర్ మాట్లాడి నష్టపరిహారంతో పాటు వాణిజ్య, వ్యాపారానికి సంబంధించిన భూములలో మనిషికి 800 గజాల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చి కళాశాలను అఘమేఘాల మీద నిర్మించారు. కేటీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతులు అదనపు భవనాలను నిర్మించకుండా అడ్డుకుంటామని తీర్మానం చేసుకోని మూడు నెలల నుంచి పనులను అడ్డుకుంటూ వస్తున్నారు. ఫిబ్రవరి 7వ తేదిన కాంట్రాక్టర్ పనులను ప్రారంభించేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి రాగా రైతులు అడ్డుకున్నారు.

దీంతో కలెక్టర్ స్పందించి రైతుల సమస్యను పరిష్కరించాలని అప్పటి ఆర్డీవోను ఆదేశించగా ఆర్డీవో ఆ రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నష్టపరిహారంతో పాటు స్థలాలు ఇస్తామంటూ సర్వేయర్‌తో సర్వే చేయించి వదిలేశారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అప్పటి ఆర్డీవో బదిలీపై వెళ్లిపోవడంతో కొత్తగా వచ్చిన ఆర్డీవో వీరి సమస్యలను పట్టించుకోకపోవడంతో పాటు సోమవారం కాంట్రాక్టర్ తిరిగి పనులను ప్రారంభించగా రైతులు పనుల ను అడ్డుకున్నారు. కాంట్రాక్టర్ పోలీసులకు సమాచారం అందించడంతో రైతులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతుల సమస్యలు విన్న సీఐ రెవెన్యూ అధికారులతో మాట్లాడి నష్టపరిహారం రాలేదని విషయం తెలుసుకోని రైతులను పంపించి వేశారు. దీనిలో భాగంగానే బుధవారం తిరిగి పనులను చేస్తుండగా రైతులు అడ్డుకొని పనులను నిలిపివేయించడంతో పాటు రిలే నిరహారదీక్షలు కూడా చేస్తామంటూ ఆందోళన చేపట్టారు. సాయంత్రం కాంట్రాక్టర్ మెడికల్ కళాశాల పనుల వద్దకు చేరుకోని ఆందోళన చేస్తున్నా రైతులపై దాడి చేయడంతో రైతులు ప్రతిఘటించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

నష్ట పరిహారం కోసం న్యాయబద్ధంగా పోరాటం చేస్తున్న తమపై దాడిచేసిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ రైతులు పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రీ బాలరాజుయాదవ్, అశోక్, రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, లింగంపల్లి దేవరాజం, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య


మణిదీప్ (ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 10: ప్రేమించిన యువతితో ఏర్పడిన మనస్పర్థలతో విడిపోయిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని రామన్నపేటకు చెందిన వకుళాభరణం మణిదీప్ (31) ఎంబీఏ చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఓ యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మరింది. వారి ప్రేమలో మనస్పర్థలు రావడంతో మనస్థాపం చెందిన మణిదీప్ గత ఫిబ్రవరిలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. మళ్లీ మంగళవారం రాత్రి ఇంట్లోని వంట గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకోవడంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి


నజీర్ (ఫైల్)

ముస్తాబాద్, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్లలో నివాసముంటున్న ఎండీ నజీర్ (42) ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన ఎండీ నజీర్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ అనా రోగ్య కారణంతో ఉండలేక తిరిగి వచ్చాడు. తాగుడుకు బానిసైన నజీర్ ఆర్థికస్థితి బాగాలేక మనస్తాపంతో గత నెల 24వ తేదీన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేట జిల్లా కేంద్రానికి చికిత్స నిమిత్తం పంపించారు. చికిత్స పొందుతూ నజీర్ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి బిజాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రబోయిన రాజు(49) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం తన పొలం గట్టుపై ఉన్న గడ్డికోస్తుండగా సమీపంలో ట్రాన్స్ ఫార్మర్ ఉంది. చూసుకోకుండా అటువైపు వెళ్లి గడ్డి కోసిన రాజు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య


మృతి చెందిన లింగారెడ్డి

కోరుట్ల రూరల్, మార్చి 10: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి లింగా రెడ్డి (70) అనారోగ్య కారణాలతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లింగా రెడ్డి కొన్ని రోజులుగా షుగర్‌తో బాధ పడుతూ చికిత్స చేయించుకున్నాడు. చికిత్సలో లింగారెడ్డి కాలు వేలును వైద్యులు తొలగించారు. అప్పడి నుంచి నిత్యం లింగారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిపారు. బుధవారం గ్రామ శివారులోని ఓ రేకుల షెడ్‌లో ఉదయం ఉరివేసుకుని అత్మహత్య చేసుకున్న ట్లు పోలీసులు తెలిపారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం అందించి నట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం చేరుకుని పరిశీలన జరిపారు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

ఇద్దరికి గాయాలు

కొడిమ్యాల, ఏప్రిల్ 10: మండలంలోని చెప్యాల ఎక్స్ రోడ్డు నుంచి దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్ వైపు వెళ్తున్న కారు బుధవారం అదుపు తప్పి సమీపంలోని పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్లకు చెందిన వేణు అతని కుమారునికి గాయాలైనట్లు తెలిసింది. గాయాలపాలైన వారిని పోలీసులు చికిత్స నిమ్మిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులకు రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

చెరువులో పడి వన్యప్రాణి మృతి


నీటిలో మృతి చెందిన మనుబోతు

వీర్నపల్లి, ఏప్రిల్ 10: చెరువులో పడి వన్యప్రాణి మృతిచెందిన సంఘటన మండలంలోని రంగంపేటలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామశివారులోని ఆటవీ ప్రాంతం నుంచి మార్గండి చెరువులో నీరు తాగడానికి వచ్చిన మనుబోతు అందులో పడి మృతి చెందింది. సమాచారం అందుకున్న ఆటవీ శాఖ సెక్షన్ అధికారి పద్మలత సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చనిపోయిన మనుబోతు కళేబరాన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. పశుసంవర్థక సిబ్బందితో పంచనామా నిర్వహించి కళేబరాన్ని దహనం చేశారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఏప్రిల్ 10: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో బుధవారం స్వామివారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రదీప్ కుమార్, నేరెళ్ల సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

నెమలి వాహనంపై స్వామివారల విహారం


నెమలి వాహనంపై విహరిస్తున్న స్వామివారు

వేములవాడ, ఏప్రిల్ 10: వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో పార్వతీ రాజ రాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభ స్వామివారలు నెమలి వాహనం పై విహరించారు. రాజ రాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం పార్వతి రాజరాజేశ్వరస్వామి, సీతా రామచంద్రస్వామి వారలకు పూజలు నిర్వహించారు. రాత్రి పార్వతీ రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభస్వామివారల ఉత్సవ విగ్రహాలను నెమలి వాహనంపై ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ వీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపు కేసులో ముగ్గురి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: రేషన్ బియ్యం అక్రమంగా రైస్‌మిల్‌కు తరలించిన కేసులో నిందితులైన గోపాల్‌పూర్ రేషన్ డీలర్ బెజ్జంకి అంజయ్య, రైస్‌మిల్ యజమాని మొగసాల సంతోష్‌రెడ్డి, ఆటో యజమాని, డ్రైవర్ ఊరడి మధులను బుధవారం అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించామని తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ రేషన్ డీలర్ అంజయ్య పేదలకు పంపిణీ కోసం వచ్చిన పీడీఎస్ బియ్యాన్ని దుర్శేడ్‌లోని శ్రీ వెంకటేశ్వర మినీ రైస్‌మిల్‌కు తరలించి విక్రయించే యత్నంలో సోమవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్, స్పెషల్‌బ్రాంచి, రూరల్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. దీనిపై మంగళవారం కేసు నమోదు కాగా నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: ఎల్లారెడ్డిపేట శివారులోని సంచార జీవుల గుడిసెలో అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం స్వాధీనపర్చుకున్నామని పోలీసులు తెలిపారు. ఖచ్చితమైన సమాచారంతో గుడిసెలో తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. గుడిసెలో నివసిస్తున్న వ్యక్తులు పారిపోయారని చెప్పారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 13 మంది వాహనదారులను బుధవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఇద్దరు వాహనదారులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 4,500 రూపాయలు జరిమానా విధించారని తెలిపారు. మిగతా 11 మంది వాహనదారులకు 21 వేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

సికింద్రాబాద్‌లో యువకుడి ఆత్మహత్య


సాయితేజ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: మండలం దుమాల గ్రామానికి చెందిన సాయితేజ (19) అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది సికింద్రాబాద్‌లో అద్దెకు ఉంటున్న భవనంపై మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామంలోని పాముల వనిత-సంతోష్ గౌడ్‌కు ముగ్గురు కొడుకులు బన్నీ, సాయితేజ, అరవింద్ ఉన్నారు. సంతోష్ గౌడ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో సంతోష్‌గౌడ్ పదేళ్ల కిందట ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో వనిత తన ముగ్గురు పిల్లలతో కలిసి ఉపాధి నిమిత్తం యేడాది కిందట సికింద్రాబాద్‌కు వెళ్లింది. అక్కడ ఓ గదిని అద్దెకు తీసుకుని పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో సాయితేజ మానసికంగా ఆరోగ్య పరిస్థితి బాగలేక పోవడం వల్ల అద్దెకు ఉంటున్న భవనంపై మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచా రం అందుకున్న అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

తల్లితో కలిసి ఉండడం నచ్చకే పినతండ్రి హత్య

డీఎస్పీ ఉమామహేశ్వరరావు


హంతకుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ

మల్లాపూర్, ఏప్రిల్, 10: తల్లితో కలిసి పినతండ్రి అంబదాస్ ఉండటం నచ్చక కోపంతో తనయుడు కందెం రవితేజ హత్య చేసినట్లు డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం హంతకుడు రవితేజను మల్లాపూర్ నంది విగ్రహం నుంచి వెళ్తుండగా అరెస్టు చేశామన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు వివరాలు తెలిపారు. మల్లాపూర్ దుర్గమ్మకాలనీకి చెందిన అంబదాస్ (54) తన రెండో భార్య అయిన భోజమ్మతో పాటు ఆమె కుమారుడు కందెం రవితేజతో కలిసి పదిహేనేళ్ల నుంచి నివాసం ఉంటున్నారన్నారు. రవితేజ చిన్నతనంలోనే తండ్రి రమేష్ మరణించగా భోజమ్మ కుమారుడు రవితేజతో కలిసి అంబాదాస్‌తో మల్లాపూర్‌లోని దుర్గమ్మ కాలనీలో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. తన తల్లి భోజమ్మ సంపాదించిన డబ్బులను అంబదాస్ వాడుకుంటున్నాడని రవితేజ కోపం పెంచుకున్నాడన్నారు. రవితేజ పని చేయకుండా జల్సాగా తిరుగుతుండగా పినతండ్రి అయిన అంబదాస్ మందలించేవాడని ఇలా చాలా రోజు నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవన్నారు. అప్పటి నుంచి జల్సాలకు అడ్డుగా ఉన్నాడని భావించి అంబాదాస్‌ను చంపాలని రవితేజ కోపం పెంచుకున్నాడన్నారు. దీంతో రవితేజ స్నేహితుడి ఇంటికి వెళ్లి మామిడి కాయలు కొట్టడానికి కత్తి అవసరం ఉందని తెచ్చుకొని శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పడుకొని ఉన్న అంబుదాస్‌పై కత్తితో విచక్షణరహితంగా దాడి చేసి పారిపోగా అంబుదాస్ అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమారలు పరిశీలించి కేసు నమోదు చేసుకొని రవితేజను రిమాండ్ తరలిస్తున్నట్లు తెలిపారు.

కొండగట్టులో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

మల్యాల, ఏప్రిల్ 10: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి జరిగే చిన్నహను మాన్ జయంతి ఏర్పాట్లను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం పరిశీలించారు. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచించారు. కొండపైన ఆలయ పరిసరాలు, కోనేరు, మాల విరమణ, క్యూలైన్‌లు ఎస్పీ పరిశీలించారు. వందలాది పోలీసులచే బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇప్పటి నుంచే ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘు చందర్, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై అబ్దుల్ రహీం, ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, ఏఈ లక్ష్మణ్‌రావు ఉన్నారు.

రాజన్న హుండీ ఆదాయం కోటి 27 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ, ఏప్రిల్ 10: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా కోటి 27 లక్షల రూపాయలకు పైగా ఆదాయం సమకూరింది. 15 రోజుల వ్యవధిలో భక్తులు స్వామి వారి హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో గట్టి భద్రత మధ్య బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా కోటి 27 లక్షల 78 వేల 950 రూపాయల నగదు, 90 గ్రాముల బంగారం, తొమ్మిది కిలోల 800 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ తెలిపారు. ఆలయ ఉద్యోగులు, శివ రామ కృష్ణ భజనమండలి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

లూజ్ లైన్లు సరిచేస్తుండగా కార్మికుడికి విద్యుదాఘాతం

- తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం


అఫుల్ హక్యూ

సుల్తానాబాద్, ఏప్రిల్ 10: సుల్తానాబాద్ శివారులోని రైస్‌మిల్లుల ప్రాంతంలో బుధవారం లూజ్ లైన్లు సరిచేస్తుం డగా షాక్ తగిలి ఓ కార్మికుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. కొన్ని రోజుల నుంచి లూజ్ వైర్లు ఉన్న వాటిని గుర్తించి అక్కడక్కడ మిడిల్ పోల్స్ వేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం కూడా విద్యుత్ కంట్రాక్టర్ ఆధ్వర్యంలో కలకత్తాకు చెందిన కార్మికులు పోల్స్ ఎక్కి వైర్లు సరిచేస్తున్నారు. ఎల్‌సీ తీసుకున్నట్టు విద్యుత్ అధికారులు చెప్పగా కార్మికుడు పోల్ ఎక్కి వైర్లు సరిచేస్తుండగా విద్యుత్ సరఫరా జరిగి పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికుడు అఫుల్ హక్యూ(20) పోల్ మీద నుంచి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ శంకర్ వివరణ కోరగా, పనుల పర్యవేక్షణ బాధ్యతను లైన్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించి తాను ఇతర పనుల నిమిత్తం వెళ్లానని తెలిపారు. ఈ సంఘటనకు లైన్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యమే కారణమన్నారు.

చిలకలూరిపేటలో రోడ్డు ప్రమాదం..

- నర్రశాలపల్లి యువకుడి మృతి


దాసరి నరేష్(ఫైల్)

జ్యోతినగర్, ఏప్రిల్ 10 : ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక నర్రశాలపల్లికి చెందిన దాసరి నరేష్(29) అనే యువకుడు మృతిచెందాడు చిలకలూరిపేట సమీపంలోని ఒక ప్రైవేటు క్వారీలో పనిచేస్తున్న నరేష్ మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చనిపోయాడు. నర్రశాలపల్లిలో తాపీ మేస్త్రీగా పనిచేస్తున్న దాసరి సూరయ్య కొడుకైన నరేష్ ఇంజనీరింగ్ చదివాడు. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ చిలకలూరిపేటలో క్వారీలో నరేష్‌కు ఉద్యోగం లభించింది. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో నరేష్ మృతిచెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

ఎల్‌ఎల్‌ఎం పరీక్ష ఫీజు 22లోగా చెల్లించాలి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 10: ఎస్‌యూ పరిధిలోని ఎల్‌ఎల్‌ఎం మొదటి సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష రుసుం ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 22వ తేదీ వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 25 వరకు తుది గడువు అని ఆయన తెలిపారు. ఈ పరీక్షలను మే నెలలో నిర్వహించనున్నారు.

●గణేశ్‌నగర్, ఏప్రిల్10: ఎస్‌యూ పరిధిలోని ఎల్‌ఎల్‌బి మొదటి సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష రుసుం ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించడానికి 22 వరకు,300/- అపరాధ రుసుంతో 25 వరకు తుది గడువు అని పరీక్షల నియంత్ర ణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను మే నెలలో నిర్వహించనున్నారు.

కవి సమ్మేళనం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 10: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో క్రోధి నామ సంవత్సరం సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సమత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుష్మ, తెలుగు విభాగాధిపతి సిహెచ్ కవిత, లైబ్రేరియన్ కె మోహన్‌రావు, మౌనిక, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

వాసవి వనిత వాగ్దేవి క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 10: వాసవీ వనిత వాగ్దేవి క్లబ్ ఆవిర్భావం, కార్యకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం వాగేశ్వరి కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు చందా విజయలక్ష్మి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆవునూరి శివలీల హాజరయ్యారు. అనంతరం క్లబ్‌ను ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షురాలిగా మాడిశెట్టి ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి స్వరూప, కోశాధికారిగా రాగి అనిత చేత జిల్లా గవర్నర్ జంధ్యం మాధవి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో క్యాబినెట్ సెక్రటరీ జంధ్యం మధుకార్, కోశాధికారి కేశెట్టి వంశీకృష్ణ, వైస్ గవర్నర్ పబ్బ అరుణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ చందా రవీందర్, క్లబ్ కోశాధికారి పండకంటి అనురాధ, కార్యదర్శి నూనె పద్మావతి తదితరులు పాల్గొని నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు.

విద్యా సంస్థల్లో వార్షికోత్సవాల హంగామా



నృత్యం చేస్తున్న శ్రీవాణి కళాశాల విద్యార్థినులు


కటికెనపల్లిలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 10: సుల్తానాబాద్ శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలల వార్షికోత్సవం మండలంలోని నర్సయ్యపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లా లయన్స్‌క్లబ్ గవర్నర్, డాక్టర్ రేకులపల్లి విజయ పాల్గొన్నారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని ఏర్పరుచుకొని, దాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చాటుకున్న వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, పురెళ్ల సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జ్యోతినగర్ : స్థానిక దుర్గయ్యపల్లి జడ్పీ పాఠశాలలో బుధవారం ఫేర్‌వెల్ హంగామా జరిగింది. 8వ తరగతి విద్యార్థులకు 7వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో ఆరెపల్లి రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇటీవలే రామగుండం మండల విద్యాధికారిగా(ఎంఈవో) నియమితులైన ఆరెపల్లి రాజయ్యను, కమాన్‌పూర్‌కు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు ఎస్.రజిత కుమారిని ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుద్దాల రేణుక, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు బేబి రాణి, ఆకుల రాజన్న, రాములు, ప్రశాంతి, రంజిత, లక్ష్మణ్, రమణ, దేవిక తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం : మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని కటికెనపల్లి, రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులు ఉత్సాహంగా నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


మచ్చుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు


రత్నాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

ముత్తారం, ఏప్రిల్ 10: మండలంలోని మచ్చుపేట, మైదంబండ, హరిపురం కేశనపల్లి, ముత్తారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ ఏపీఎం పద్మ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వడ్ల తూకం చేశారు. రైతులు దళారులను నమ్మి ప్రైవేట్ వ్యక్తులకు వడ్లను విక్రయించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలలో మాత్రమే రైతులు ధాన్యం విక్రయించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వేణుమాధవ్, ఏఈవో హారిక, సీసీలు తిరుపతి, రాజ్యలక్ష్మి, రాధిక, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామగిరి : ప్రభుత్వపరంగా ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శైలజ అన్నారు. బుధవారం మండలంలోని రత్నాపూర్, బేగంపేట్, ముస్యాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో ప్రారంభించి మాట్లాడారు. ప్రతిఒక్క రైతు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. దళారులను నమ్మిమోసపోవద్దని సూచించారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం స్వరూపరాణి, సీసీలు శంకర్, రమేశ్, శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సాగు నీరు అందక ఎండిన పొలాలు


కొత్తపల్లిలో ఎండిన వరిపంట

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 10: చేతికి అందివచ్చిన పచ్చటి పొలాలు పశువులకు గ్రాసంగా మారుతున్నాయి. పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లికి చెందిన మంద ఈశ్వ రమ్మకు చెందిన రెండెకరాల వరిపంట నీరు లేక ఎండిపోవడంతో పశువులకు మేతగా మారింది. లక్ష రూపాయలు ఖర్చు చేసి వేసిన బోరు భూగర్భ జలాలు అడుగంటిపో యి ఉపయోగం లేకుండా పోయిందని ఈశ్వరమ్మ వాపోయింది. ఇటీవల ఎస్సారెస్పీ కాలువకు సాగునీరు విడుదల చేసినప్పటికీ పంటకు సరిపడా అందక ఎండిపోయింద ని తెలిపారు. ప్రభుత్వం పరిహారం అందించాలని ఆమె కోరింది.

అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 10: బడుగు, బలహీనవర్గాల కోసం తన జీవితాన్ని పణంగా పెట్టిన మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని యునైటెడ్ పూలే ఫోరం రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. చదువు ద్వారానే బడుగుల జీవితాల్లో మార్పు సాధ్యమని భావించి పేదబడుగు వర్గాలకు చదువు నేర్పించిన మహనీయుడు ఆయన అని కొని యాడారు. కేవలం చదువుతోనే సమాజంలో స్వేచ్ఛ, సమానత్వంతో పాటు ప్రశ్నించే హక్కు సాధ్యమవుతుందని బలంగా నమ్మిన మహనీయుడు పూలే అని, అలాంటి మహనీయుడి విగ్రహాన్ని తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలో తెలంగాణ యునైటెడ్ ఫోరం గత కొన్నిరోజులుగా డిమాండ్ చేస్తుందని అన్నారు. ప్రభుత్వ మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేస్తారా చేయరా అనే విషయం గురువారం మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగానైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారని హరిప్రసాద్ ఫోరం పక్షాన హెచ్చరించారు.

కరాటే క్రీడాకారులను అభినందించిన ఏసీపీ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 10: కరాటేలో ప్రతిభ చూపిన క్రీడాకారులను బుధవారం టౌన్ ఏసీపీ నరేందర్ తన కార్యాలయంలో అభినందించారు. ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో స్థానిక మంకమ్మతోటలోని సిద్దార్థ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కరాటే పోటీ పరీక్షల్లో కరాటే శిక్షకుడు పుల్లూరి శ్రీనివాస్ శిక్షణలో ఐదుగురు క్రీడాకారులు బ్లాక్ బెల్ట్ సాధించారు. క్రీడాకారులు వి వైష్ణవి, ఎల్ సుప్రీతి చౌహాన్, ఎల్ ప్రీతమ్‌చౌహాన్, కె తేజస్‌రెడ్డి, ఆర్ శ్రీవర్ధన్‌లు బ్లాక్‌బెల్ట్ సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఒకినోవా కరాటే సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

నేత్ర దానంపై సామాజిక చైతన్యం రావాలి


మృతుడి కుటుంబానికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

ఓదెల, ఏప్రిల్ 10: గ్రామాల్లో నేత్ర, అవయవ, శరీర దానంపై ప్రజలందరికీ సామాజిక చైతన్యం రావాలని సదాశివ ఫౌండేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, కార్యదర్శి మేర్గు భీష్మచారి అన్నారు. ఇటీవల మృతిచెందిన బైరి శ్రీనివాస్ ఇంటి వద్ద బుధవారం సదాశియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభను నిర్వహించారు. మృతుడు శ్రీనివాస్ నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులను అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బైరి వినోద్, సాయి, రజిత, క్యాతం సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మహేందర్, మేర్గు సారంగం, క్యాటం వెంకటేశ్వర్లు, కొండ్ర వేణు, అల్లం సతీష్, ఇప్పలపల్లి వెంకటేశ్వర్లు, క్యాతం రాజేంద్రప్రసాద్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ క్యాంపులో టేకు చెట్లు మాయం


ఎస్సారెస్పీ క్యాంపులో కోతకు గురైన టేకు చెట్లు

ఓదెల, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలో ఉన్న ఎస్సారెస్పీ క్యాంపులో ఉన్న టేకు చెట్లు చోరీకి గురయ్యాయి. గతంలో కురిసిన వర్షానికి చెట్లు నేలవాలి పోగా, కొందరు వ్యక్తులు అక్కడున్న విలువైన రెండు చెట్లను కటింగ్ మిషన్‌తో కోసుకెళ్లారు. ప్రస్తుతం నేలవాలిన మరో నాలుగు చెట్లకు భద్రత లేదు. ఇక్కడ దాదాపు 80కి పైగా టేకు చెట్లు ఉన్నాయి. 15 ఏళ్ల నుంచి ఉంటున్న చెట్లు ఏపుగా పెరగడంతో గాలి దుమారం వచ్చినప్పుడల్లా నేలవాలిపోతున్నాయి. ప్రస్తుతం అకాలవర్షం, గాలి దుమారాలు ఉన్నందున మిగిలిన టేకు చెట్లు నేలకూలి పోయే పరిస్థితి ఉంది. వెంటనే అధికారులు స్పందించి టేకు చెట్లను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడిగా నాగభూషణం



కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 10: గౌడ జన హక్కు పోరాట సమితి మోకు దెబ్బ జిల్లా అధ్యక్షునిగా గోదావరిఖనికి చెందిన బెంది నాగభూషణంను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అమరవేని నర్సాగౌడ్ ఉత్తర్వులు అందజేశారు. 30సంవత్సరాలుగా నాగభూషణం గీత కార్మికులు, గౌడ కులస్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ గౌడ కులస్థుల సంక్షేమం కోసం కృషి చేస్తానని, తన నియామకం కోసం కృషి చేసిన ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ధి రాములు, బాలసాని సురేష్, చేపూరి శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'బీజేపీని ఓడించాలి'


వెంకటేశ్వర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 10: మతోన్మాద బీజేపీని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తరిమికొట్టాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు ఐ.కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం గోదావరిఖని గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బతుకుల రాజన్న ఆధ్వర్యంలో జరిగిన అరుణోదయ సాంస్కృతిక వ్యవస్థాపక అధ్యక్షుడు కానూరి వెంకటేశ్వర్‌రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే వెంకటేశ్వర్‌రావు అభ్యుదయ భావాలతో పోరాటాల్లోకి వచ్చారన్నారు. అరుణోదయ సాంస్కృతికి రథ సారధిగా వ్యవహరించిన ఆయన సేవలు మరువలేనివన్నారు. ఆయన అడుగు జాడల్లో నాయకులు, కార్యకర్తలు నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు నరేష్, రవికుమార్, అబెడ్నెగో, మల్లేష్, బాణేష్, ధర్మేందర్, రాంకీ, శ్రీకాంత్, మల్లేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

ఎలిగేడు, ఏప్రిల్ 10: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పలు పాఠశాలలను బుధవారం ఆయా పాఠశాల హెచ్ఎంలు, చైర్‌పర్సన్‌లు సందర్శించారు. పెండింగ్ పనులపై బాలికల, బాలుర మరుగుదొడ్లు, డ్రింకింగ్‌వాటర్, ఎలక్ట్రిల్ ప్లంబింగ్ సంబంధించిన పనులను గుర్తించి వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంపీఓ అనిల్‌రెడ్డి, పీఆర్ఏ ఈ.జగదీశ్వర్, ఐకేపీఏపీఎం సుధాకర్, సిసిలు జ్యోతి, మల్లేశం, ఆనంద్, వీఓలు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంఈవో సురేంద్రకుమార్

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్10: మండలంలోని కనగర్తి గ్రామంలో వేసవి దృష్ట్యా తాగునీటికి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి మండల విద్యాధికారి, గ్రామ ప్రత్యేకాధికారి సురేంద్రకుమార్ అన్నారు. బుధవారం కనగర్తి గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చెత్తచెదారం రోడ్లపై పడేయకుండా మహిళ సభ్యులు గ్రామస్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి శ్రీలతతో పాటు పలువురు పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌కు సన్మానం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 10: కరీంనగర్ విద్యానగర్‌లోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి మాట్లాడుతూ సుడా చైర్మన్‌గా వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. అసోసియేషన్ కార్యవర్గం నరేందర్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఉపాధ్యక్షులు సత్తయ్య, ప్రధాన కార్యదర్శి రవీందర్, సత్తయ్య, కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, మహాలక్ష్మి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.



కాపర్ వైరు చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

- సీఐ వెంకటేశ్వర్లు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

రామగిరి, ఏప్రిల్ 10: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు మంథని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సందీప్‌లు బుధవారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. ఈనెల 5న ఓసీపీ-2 ప్రాజెక్టులో రాగి వైరు దొంగతనం కేసుపై విచారణలో భాగంగా నాగేపల్లి క్రాస్ రోడ్‌లో ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలో అనుమానాస్పదంగా ఇద్దరు బైక్‌పై బ్యాగ్‌తో వెళ్తుండగా సోదాలు చేయగా అందులో సుమారు 24 కిలోల కాపర్‌వైర్ లభ్యం అయినట్లు తెలిపారు. వారిని విచారించగా నవాబ్‌పేట్ గ్రామానికి చెందిన పస్తాం తిరుపతి, నాగేపల్లిలో నివాసం ఉంటున్న మోటం అజయ్‌గా గుర్తించినట్లు తెలిపారు. కాపర్ విలువ సుమారు రూ. 85వేల వరకు ఉంటుందని అంచనా, వీరిని అరెస్ట్ చేసిన కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అమరుల స్మారక చిహ్నాన్ని నిర్మించాలి

టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, ఏప్రిల్ 10: సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం ప్రాణాలను త్యాగంచేసిన కార్మిక యోధుల స్మారక చిహ్నాన్ని సింగరేణి సంస్థ నిర్మించాలని సింగరేణి బొగ్గుగని కార్మిక సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 134సంవత్సరాలు చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ ప్రస్తుతం 700లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించే స్థాయికి చేరుకుందన్నారు. సింగరేణి సంస్థ పురోభివృద్ధికి కార్మికులు తమరక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులు ప్రసాదిస్తున్నారని, ప్రపంచ కార్మిక పోరాటాలను మలుపు తిప్పి మేడే సందర్భంగా బొగ్గు ఉత్పత్తిలో అసువులు బాసిన సింగరేణి అమర కార్మికుల కోసం స్మారక చిహ్నాన్ని ఏర్పాటుచేయాలని ఆయన యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బొగ్గు గనుల్లో దుర్భర పని పరిస్థితులను, కార్మికుల త్యాగం, విలువలు తెలియజెప్పడానికి, భవిష్యత్ తరాలకు ఎంతో ఉప యోగపడుతుందన్నారు. ప్రపంచంలోనే ఇతర పారిశ్రామిక దేశాల్లో కార్మి క కేంద్రాల అభివృద్ధి నమూన ఇక్కడ కూడా అమలు చేస్తే బాగుంటుం దన్నారు. 138వ మేడే సందర్భంగా అమరుల స్మారక కేంద్రానికి సింగరేణి యాజమాన్యం భూమిపూజ చేసి పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు మాదాసు రామమూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, పొలాడి శ్రీనివాసరావు, జాహెద్‌పాషా, చల్లా రవీందర్‌రెడ్డి, గోపి, రాజ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, పల్లె సురేందర్, పులిపాక శంకర్, శేషగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ల తొలగింపుపై నాయకుల దుష్ప్రచారం

గోదావరిఖని, ఏప్రిల్ 10: గోదావరిఖని పట్టణ అభివృద్ధి కోసం భాస్కర్‌రావు భవన్ నుంచి మేదరిబస్తీ వరకు క్వార్టర్ల తొలగింపుపై కొంత మంది యూనియన్ నాయకులు కార్మికులను పక్కదోవ పట్టిస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రెండురోజుల క్రితం ఈ క్వార్టర్లకు సంబంధించిన కార్మికులకు సెక్టార్-1, 2 ఏరియాల్లో కౌన్సెలింగ్ నిర్వహించి వారికి క్వార్టర్ల కేటాయింపునకు సింగరేణి యాజమాన్యం ముందుకు వచ్చింది. కొంతమంది చోటామోటా నాయకులు మీరు ఖాళీ చేయవద్దు, కోర్టులో కేసులు వేశామంటూ వారికి తప్పుడు సమాచారం ఇస్తున్నారు. దీంతో కార్మికులు అయోమయంలో పడ్డారు. 72క్వార్టర్లు తొలగించడానికి సింగరేణి యాజమాన్యం ముందుకు వచ్చి క్వార్టర్లలో నివాసముంటున్న కార్మికులకు 15రోజుల్లో ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇచ్చింది. కార్మికులు క్వార్టరుల ఖాళీ చేయడానికి సిద్ధపడగా కొంత మంది కోర్టులో కేసులు వేశాం, ఖాళీ చేయాల్సిన అవసరం లేదంటూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్లను తొలగించేందుకు సిద్ధపడింది. ఇందులో భాగంగా రోడ్డు పక్కకు ఉన్న రెండు క్వార్టర్లను కూల్చివేసి రోడ్డును విస్తరించడానికి శ్రీకారం చుట్టింది. చోటా, మోటా నాయకుల మాటలు కార్మికులను గందరగోళపరిస్థితుల్లోకి నెడుతుండగా, కొంత మంది స్వచ్ఛందంగా క్వార్టర్లను ఖాళీచేసి వెళ్లిపోతున్నారు. శివాజీ నగర్‌లో క్వార్టర్ల కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి.

ఖాళీ చేయని క్వార్టర్లకు కరెంటు కట్

సింగరేణి యాజమాన్యం నోటీసులు ఇచ్చిన ఖాళీ చేయని క్వార్టర్లకు బుధవారం సింగరేణి యాజమాన్యం కరెంటు కట్ చేసింది. నోటీసు ఇచ్చినా కొంత మంది మొండిగా వ్యవహరిస్తున్నందున బుధవారం క్వార్టర్లు ఖాళీ లేకపోతే విద్యుత్ సరఫరా, మంచినీటి సరఫరా నిలిపివేస్తామని యాజమాన్యం హెచ్చరించింది.